క్లుప్తంగా

వైన్స్‌లో చోరీ

హన్మకొండ (పరకాల) : పరకాల పట్టణంలోని వెల్లంపల్లి రోడ్డు సమీపంలో గల గంగా వైన్స్‌లో గురువారం రాత్రి గొంగలు పడ్డారు. వైన్స్‌లోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి డీవీఆర్‌తో పాటు కౌంటర్‌లోని రూ. 20 వేల నగదును అపహరించినట్లు వైన్స్ యజమాని పరకాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గత కొంత కాలంగా వెల్లంపల్లి రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి సంచరిస్తూ కొత్త భవనాలకు సంబంధిత సామగ్రిని అపహరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 20న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గాంధీనగర్, రెడ్డిపురం, బుద్ధనగర్, యాదవనగర్, మడికొండ టెక్స్‌టైల్ పార్కు, రాంపూర్ ప్రాంతాల్లో ఉదయం 9గంట నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఏనుమాముల మార్కెట్ రోడ్డు, రెడ్డి పాలెం, కొత్తపేట, దేశాయిపేట, ఎల్‌బీనగర్, బాలాజీనగర్, ఓసిటీ, లేబర్ కాలనీ, రాంకీ, ఎస్‌ఆర్‌టీ, టీఆర్‌టీ కాలనీ, హంటర్ రోడ్డు, బీట్‌బజార్, రామన్నపేట ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. భీమారం, కోమటిపల్లి, భద్రకాళి కాలనీ, చింతగట్టు, ఎర్రగట్టు గుట్ట, కిట్స్ కళాశాల, హసన్‌పర్తి ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు అమ్మవారికి కూరగాయల సమర్పణ

హన్మకొండ కల్చరల్: భద్రకాళి అమ్మవారి శాకంబరీ మహోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి అలంకరణ కోసం వివిధ రకాల కూరగాయలు, పండ్లను మహబూబాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో సమర్పించనున్నారని భద్రకాళి దేవాలయం ఈఓ శేషుభారతి ఒక ప్రకటనలో తెలిపారు. సేవా సమితి అధ్యక్షుడు గారెపల్లి నవీన్‌కుమార్ అధ్యక్షతన 2500మంది సభ్యులు శనివారం ఉదయం 9గంటలకు పోచమ్మ మైదాన్ నుంచి ర్యాలీగా భద్రకాళి దేవాలయానికి చేరుకొని అమ్మవారికి కూరగాయలు సమర్పిస్తారని వివరించారు.

నేడు రైల్వే పెన్షనర్లకు వైద్య శిబిరం

కాజీపేట రూరల్: కాజీపేట పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ కార్యాలయం వద్ద ఏ టు జడ్ ఫార్మసీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ కాజీపేట బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రావు, కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు దత్తక్షేత్రంలో గురుపౌర్ణమి పూజలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ ములుగురోడ్డులోని గణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో గురు పౌర్ణమిని పురస్కరించుకుని దత్తాత్రేయస్వామి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తైలాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, శ్రీగురుపాదుకా పూజ, గురుగీతా పారాయణం, ప్రత్యేక అర్చనలు జరుగుతాయని వరంగల్ దత్త జ్ఞానబోధ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

రేపు ఐక్యవేదిక సమావేశం

నయీంనగర్: నేత్ర, అవయవ, శరీర దాన ఐక్యవేదిక సమావేశాన్ని గోపాల్‌పూర్ క్రాస్ వద్ద ఆదివారం నిర్వహించనున్నట్లు డైరెక్టర్ కోస్‌రెడ్డి మల్లారెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నేత్ర, అవయవ, శరీర దాన ప్రాముఖ్యత, భావజాలాన్ని వ్యాప్తి చేయడం ఈ సమావేశ ఉద్దేశమని పేర్కొన్నారు. వివరాలకు 87905 48706 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నిత్యావసర సరుకుల అందజేత



మడికొండ: మడికొండ గ్రామానికి చెందిన నాయిని వెంకటమ్మ కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను మడికొండ పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జయరాజ్ శుక్రవారం అందజేశారు. తొలి ఏకాదశి సందర్భంగా వెంకటమ్మకు చేయూతనిచ్చినట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- పేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు, రేషన్‌కార్డులివ్వాలి
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా
- వినతిపత్రాల సమర్పణ



ఎల్కతుర్తి : డిప్యూటీ తహసీల్దార్ భద్రునాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఎల్కతుర్తి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. గుడిసెలు వేసుకున్న స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఐదు లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జులై 26వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ భద్రునాయక్‌కు వినతిపత్రం అందించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్, నాయకులు వెంకటరమణ, శ్రీనివాస్, రాజ్‌కుమార్, మొండయ్య, కుమారస్వామి, మనోహర్, మోహన్‌రెడ్డి, మల్లయ్య, రాజు, రవీందర్, లలిత, విజయ, సావిత్రి, రాధికతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందించారు. పీచర, కన్నారం గ్రామాల్లో ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తామని మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను, ఇంటి స్థలాలను అర్హులైన పేదలకు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శంకరయ్య, రమేశ్ పాల్గొన్నారు.



శాయంపేట : డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

శాయంపేటలో..

శాయంపేట : పెద్దకొడపాక రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 633 ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న వారికి శాశ్వత పట్టాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి బత్తిని సదానందం ప్రభుత్వాన్ని కోరారు. గుడిసెవాసులకు శాశ్వత పట్టాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతికి అందించారు. అశోక్, రమేశ్, రాము పాల్గొన్నారు.



వేలేరు : డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దామెరలో..

దామెర : పేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అన్నారు. మండల కేంద్రంలో గుడిసెవాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి వినతిపత్రం సమర్పించారు.

శిథిలావస్థలో ఉన్న గృహాల్లో ఉండొద్దు

- ఎంపీడీఓ బాబు



శిథిలావస్థలో ఉన్న నివాస గృహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్ : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థలో ఉన్న నివాస గృహాల్లో ఉండొద్దని ఎంపీడీఓ గుండె బాబు ప్రజలకు సూచించారు. మండలంలోని గోపాల్‌పూర్, శనిగరం గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. శిథిలావస్థలో ఉన్న నివాస గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లోని పాఠశాలలు, గ్రామ పంచాయతీ భవనాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి శిథిలావస్థలో ఉన్న నివాస గృహాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులంతా ప్రజలకు అందుబాటులో ఉండి వర్షాల కారణంగా రోడ్లు, చెరువులకు జరిగే నష్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ మరమ్మతులు అవసరమైన చోట సంబంధిత శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా చూడాలని ఆదేశించారు. ఈజీఎస్ ఏపీఓ రమేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కమలాపూర్ : సైబర్ నేరగాళ్లు కొత్త రకం మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు +923484818370, +97118001088, 07316856787 నంబర్ల నుంచి వాట్సాప్, జనరల్ కాల్స్ చేస్తూ 'నేను పోలీస్ ఆఫీసర్‌ను మాట్లాడుతున్నాను. మీ అబ్బాయి/అమ్మాయి గంజాయి లేదా ఇతర కేసులో పట్టుబడ్డారు. మీరు వెంటనే మేము చెప్పిన నంబర్‌కు డబ్బులు పంపించండి, లేదంటే మీ అబ్బాయి/అమ్మాయిని జైలుకు పంపిస్తాం' అని బెదిరింపు కాల్స్ చేస్తున్నారన్నారని తెలిపారు. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దని అన్నారు. వాట్సాప్‌లో వచ్చే ఎలాంటి లింకులు ఓపెన్ చేయవద్దని సూచించారు. అనుమానం వస్తే తక్షణమే 1930 నంబర్‌కు కాల్ చేయాలని ఆయన సూచించారు.

మహిళా చైతన్యంతోనే సాధికారత



మాట్లాడుతున్న డాక్టర్ దామోదర్

ఆత్మకూరు : మహిళల్లో చైతన్యం వచ్చినప్పుడే సాధికారత సాధ్యమవుతుందని సర్వోదయ యూత్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. మండల కేంద్రంలో సర్వోదయ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి స్వయం సహాయక సంఘాల లీడర్లకు లింగాధారిత హింసపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వోదయ సంస్థ సామాజిక అభివృద్ధిలో భాగంగా వివిధ వర్గాలతో పనిచేస్తోందన్నారు. ప్రత్యేకంగా మహిళల కొరకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. హింసకు గురైన మహిళలకు సహకారం అందిస్తే కుటుంబానికి బంగారు భవిష్యత్తు ఉంటుందని, మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం అన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్, ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఇందిర, ఫీల్డ్ ఆఫీసర్ రవీందర్, క్లస్టర్ కో ఆర్డినేటర్ శ్రీలత, సఖి కేస్ వర్కర్ వినీల పాల్గొన్నారు.

అప్రెంటిస్ జాబ్‌మేళాకు విశేష స్పందన



రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న విద్యార్థులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, రీజినల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన అప్రెంటిషిప్ కమ్ జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. 12మంది ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా ఆర్‌డీఎస్‌డీ ఈ – ట్రైనింగ్ ఆఫీసర్ విజయకుమార్ మాట్లాడుతూ ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలిపారు. ప్రోత్సాహకంగా ప్రభుత్వ సాంకేతిక శిక్షణ నైపుణ్య సంస్థ ద్వారా రూ.7 వేలు ఉపకార వేతనాలు కూడా లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో హనుమకొండ డీఐఈఓ గోపాల్, స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ రీడర్ రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అప్రెంటిషిప్ మేళా కోకన్వీనర్ మాధవరావు, జనగామ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి శాగంటి శ్రీనివాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, రిటైర్డ్ ప్రిన్సిపాల్ దివాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన 'ట్రెంగా' జిల్లా అధ్యక్షుడు



ఐనవోలు : తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగా) జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఐనవోలు ఆర్‌ఐ మరుపట్ల మల్లయ్య, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవితో కలిసి శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పూలబొకే అందించగా కలెక్టర్ ప్రావీణ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, కార్యవర్గ సభ్యులు ఐలయ్య సాంబరాజు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల సీజ్

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలను అధికారులు సీజ్ చేశారు. ఈ ఏడాది ఏకలవ్య పేరుతో స్థానికంగా పాఠశాలను ప్రారంభించారు. 1వ నుంచి 5వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే, ఆ పాఠశాల కారణంగా ప్రభుత్వ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య పడిపోతోందని జిల్లా విద్యాశాఖ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. వంగపహాడ్‌లో ప్రైవేట్ పాఠశాలలకు అనుమతి ఇవ్వొద్దని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాంతో మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలను సందర్శించి సీజ్ చేశారు. అనుమతి లేకుండా తరగతులు కొనసాగించే ఏ పాఠశాలనైనా సీజ్ చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలని, అన్ని అనుమతులు పొంది ఉండాలని అన్నారు.

లలితాదేవికి ప్రత్యేక పూజలు

ఖిలా వరంగల్: ఆషాఢ మాసం సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలోని లలితాదేవి అమ్మవారికి శాకంబరీ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఏదైనా సాధ్యమే

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు : పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో రోటరీ క్లబ్ జిల్లా బాధ్యుడు కోరె చంద్రమౌళి సహకారంతో సైకిళ్ల పంపిణీ కార్యక్రమం జరుగగా ఆయన హాజరయ్యారు. 8వ తరగతి చదువుతున్న సాయి నైమిశ, హేమలత, రంజిని, ప్రియకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ప్రతాపరత్న కుమార్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాఠశాలకు ఆటస్థలం, లైబ్రరీ తదితర మౌలిక సదుపాయాలు సమకూర్చేందుకు దాతలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. పిల్లలు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సకినాబీ, నాయకులు పెండ్లి నవీన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు

కమలాపూర్ : ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవడమే కాకుండా ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోకుండా ఆయా యాజమాన్యాలకు కొమ్ముకాస్తున్న కమలాపూర్ మండల విద్యాధికారి (ఎంఈఓ)ను వెంటనే సస్పెండ్ చేయాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, కో కన్వీనర్ మున్నా గణేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత నెల 22వ తేదీన ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా యూనిఫాం అమ్ముతున్న మండలంలోని అంబాల గ్రామ శివారులో గల సాకేత స్కూల్‌పై డీఎస్ఏ నాయకులు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో ఎంఈఓ ఆ స్కూల్ యూనిఫాం సీజ్ చేశారని, అనంతరం ఆ స్కూల్ యాజమాన్యంతో కుమ్మక్కైనట్లు ఆరోపించారు. విద్యార్థి సంఘాల నాయకులు డబ్బులు తీసుకుని పిటిషన్ వెనక్కి తీసుకోవాలని లేదంటే తాము కేసులు పెట్టాల్సిన వస్తుందని బెదిరించినట్లు ఆరోపించారు. సాకేత స్కూల్‌పై చర్యలు తీసుకోకపోవడంపై జిల్లా విద్యా శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సదరు ఎంఈఓ జిల్లా విద్యాశాఖ అధికారులను కూడా తప్పుదోవ పట్టించారని ఫిర్యాదు పేర్కొన్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అక్రమ అరెస్టు సరికాదు

శాయంపేట : ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు కొమ్ముల శివ అన్నారు. నిరుద్యోగుల ఛలో సెక్రటేరియట్ ముట్టడికి బీఆర్‌ఎస్వీ పిలుపునిచ్చిన నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి పోలీసులు తనను అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడు నెలల కాలంలోనే తెలంగాణ ఉద్యమకారులను, నిరుద్యోగులను, యువజన విద్యార్థి నాయకులకు భయపడి అరెస్టు చేయిస్తుందని విమర్శించారు. డీఎస్సీ ఉద్యోగాలు పెంచాలని, నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకై శాంతియుతంగా నిరసన తెలుపేందుకు వెళ్తున్న తనను అక్రమంగా అరెస్టు చేయడం సమంజసరం కాదన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు.

మూఢనమ్మకాలను వీడాలి



శాయంపేట : నేటి ఆధునిక యుగంలో శాస్త్ర సాంకేతిక రంగాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రజలు మాయలు, మంత్రాలు భూత వైద్యులు అంటూ మూఢనమ్మకాలను నమ్ముతున్నారని, వాటిని వీడనాడాలని సామాజిక సేవకుడు అమ్మ అశోక్ అన్నారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని మూడు బాటల కూడలిలో గుర్తుతెలియని వ్యక్తులు కోడిగుడ్లు, మాంసంను ఉంచగా శుక్రవారం ఆయన గ్రామస్తుల సమక్షంలో తొలగించారు. ఇలాంటి వాటితో భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు సూచించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, వైద్యులు చెప్పిన సలహాలు, సూచనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం



ఆత్మకూరు : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తోందని ఈ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పలిత శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో గురువారం సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మూడు డీఏలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని కోరారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ప్రధానకార్యదర్శి భుజంగరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, సోమయ్య, రమేశ్ పాల్గొన్నారు.

బ్యాంకుల వద్ద రైతుల సందడి



భారతీయ స్టేట్ బ్యాంక్ వద్ద అంటించిన నోటీస్‌బోర్డుపై పేరు చూసుకుంటున్న రైతులు

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ చేసిన విషయం తెలిసిందే. కాగా రుణమాఫీ పొందిన రైతుల ఫోన్లకు మెస్సేజ్‌లు రావడంతో రైతులు శుక్రవారం బ్యాంకుల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకోగా సందడి నెలకొంది. శాయంపేట గ్రామంలోని భారతీయ స్టేట్ బ్యాంక్‌లో 498 మంది రైతులకు రూ.3,60,95,659 రుణమాఫీ అయినట్లు ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రాజేష్ తెలిపారు. రుణమాఫీ పొందిన రైతుల పేర్లను బ్యాంకు ముందు నోటీసు బోర్డులో ప్రచురించామన్నారు. దీంతో జాబితాలో తమ పేరు ఉందో, లేదో తెలుసుకునేందుకు రైతులు ఎగబడ్డారు. రైతులు తీసుకున్న రుణంలో చెల్లింపు ఉన్నవారికి ఎన్‌పీఏ గా నమోదు చేసినట్లు తెలిపారు. వీరు కొద్ది మొత్తాన్ని బ్యాంకుకు చెల్లిస్తే మరుసటి రోజు రుణమాఫీ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని ఆయన పేర్కొన్నారు. మరి కొంతమంది రైతులకు రెన్యువల్ కాకపోవడంతో డ్యూ ఆఫ్ రెన్యువల్‌గా ప్రకటించడంతో సంబంధిత రైతులు రెన్యువల్ చేసుకుంటే రుణమాఫీ సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని సూచించారు. రెగ్యులర్‌గా ఉన్న రైతులకు రుణమాఫీ సొమ్ము నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు ఆయన వెల్లడించారు. పలు సందేహాలను నివృత్తి చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐనవోలు : కొండపర్తి సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ పద్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముల్కలగూడెం, నర్సింహులగూడెం, కొండపర్తి గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చదువుతోనే ఉపాధి అవకాశాలు



మాధవిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రామన్నపేట: చదవుతోనే మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి సూచించారు. నగరంలోని ఎల్‌బీ కళాశాలలో ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ మంచిగా చదువుకున్నప్పుడే మంచి ఉద్యోగాలను పొంది ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని వివరించారు. జెన్‌ప్యాక్ట్, క్యూకనెక్ట్, ఫ్లిప్‌కార్ట్, పేటీఎం, తదితర కంపెనీలు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశాయి. మెగాజాబ్ మేళాలో ఎల్‌బీ కళాశాలతో పాటు పలు కళాశాలకు చెందిన సుమారు 550 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు వివరించారు. అనంతరం జిల్లా ఉపాధి అధికారి మాధవికి కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మెమెంటో అందించి సన్మానించారు.

అమ్మ మాట - అంగన్‌వాడీ బాట



మడికొండ: టీచర్లు, పిల్లలతో రాధికాగుప్తా

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని అంగన్‌వాడీ -3వ సెంటర్‌లో అమ్మ మాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా పాల్గొని పిల్లల బరువు, ఎత్తును పరిశీలించారు. వారి పోషణ స్థితి, సెంటర్‌లోని వసతులను అంగన్‌వాడీ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ డి.రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ వసంత, రాజ్యలక్ష్మి, లలిత, వెంకటలక్ష్మి, రాజమణి, ఆయా సరోజన పాల్గొన్నారు.